సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 28 । జనవరి । 2025



బాలికల భద్రతకే షీ టీమ్స్

బాలికల భద్రతకే షీ టీమ్స్ పనిచేస్తాయని.. విద్యార్థినులు ఆత్మ విశ్వాసంతో ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ సూచించారు. 8లో▸



విఘాతం కలిగిస్తే ఊరుకోం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని ఏసీపీ రంగస్వామి అన్నారు. 8లో▸



నిషేధానికి అడుగులు

ఎన్నికలప్పుడు మద్యం పంచినా, అమ్మినా, కొన్నా జరిమానా విధిస్తామని ఉప్పరిగడ్డ తండావాసులు తీర్మానం చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

15,597 మంది రైతులు.. రూ.20.32 కోట్లు

తొలిరోజు 'రైతు భరోసా' జమ

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రైతు భరోసా పథకం పంపిణీలో భాగంగా తొలి రోజైన సోమవారం జిల్లాలోని 21 మండలాల పరిధిలోని 21 గ్రామాల్లో 15,597 మంది రైతుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.20.32 కోట్ల నగదు జమ చేసింది. వికారాబాద్ జిల్లాలో 20 మండలాల పరిధిలోని 20 గ్రామాల్లో 8,609 మంది రైతుల ఖాతాల్లో రూ.11.18 కోట్లు, మేడ్చల్ జిల్లాలో ఐదు గ్రామాల్లోని 2,706 మంది రైతుల ఖాతాల్లో రూ.3.14 కోట్లు జమ చేసింది.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



తహసీల్దార్ సురేందర్‌కి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సురేందర్‌కి స్థానిక నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానానికి కొన్ని మెరుగులు దిద్ది యూపీఎస్ (ఏకీకృత పెన్షన్ స్కీమ్)ని ఏప్రిల్ నుంచి ప్రవేశపెడుతోందని, దాన్ని తెలంగాణలో అమలు చేయొద్దన్నారు. కొత్త పెన్షన్ స్కీమ్‌తో ఉపాధ్యాయులకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారని, ఇక్కడా అదే పాటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు మాణిక్యం, ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

యాచారం: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీలతతో కలిసి వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజా సమస్యలపై దృష్టి సారించి, వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. వేసవి కాలం ప్రారంభమవుతున్న దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాబ్ కార్డులు కలిగిన ఉపాధి కూలీలకు చేతినిండా పని కల్పించాలన్నారు. గ్రామాల్లో డ్రైనేజీ సమస్యలు లేకుండా చూడాలని చెప్పారు. ఈజీఎస్ నర్సరీల్లో పెంచే మొక్కల విషయంలో నిర్లక్ష్యం వద్దని, వర్షాలు కురిసిన వెంటనే నాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీల్లో నిధుల ఖర్చు విషయమై జాగ్రత్తలు పాటించాలని, ప్రతి పైసాకు రికార్డులు కచ్చితంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు.

ఒక వాహనం.. 3 నంబర్ ప్లేట్లు

ఉప్పల్: ఒక వాహనానికి మూడు నంబర్ ప్లేట్లు తయారు చేయించి.. ఎక్కడికక్కడే ప్లేట్‌ను మారుస్తూ.. మూడు రాష్ట్రాల్లో వాహనాన్ని తిప్పుతున్న వ్యక్తిని ఉప్పల్ రవాణా శాఖ అధికారులు పట్టుకున్నారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఉత్తర ప్రదేశ్ ప్రాంతానికి చెందిన మ్యాక్సీ క్యాబ్ వాహనాన్ని (యూపీ 64టీ 9495) సురేశ్‌బాబు అనే డ్రైవర్ ఆర్టీఏ అధికారుల కళ్లుగప్పి ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తిప్పుతున్నాడు. అధికారులకు దొరక్కుండా ఉండేందుకు, పన్నులు ఎగవేసేందుకు ఏ రాష్ట్రానికి వెళ్తే అక్కడి నంబర్ ప్లేట్‌ను మార్చి వాహనాన్ని అక్రమంగా నడుపుతున్నాడు. రెగ్యులర్ చెకింగ్‌లో భాగంగా సోమవారం ఉప్పల్ ఎంవీఐ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా.. ఇక్కడి రిజిస్ట్రేషన్ లేదని గ్రహించడంతో అసలు విషయం బయటపడింది.

అగ్గి..అంతా బుగ్గి!

హైరైజ్ బిల్డింగుల్లోనూ అగ్ని ప్రమాదాలు

నాసిరకం విద్యుత్ కేబుళ్లు, పరికరాల వినియోగం..తనిఖీ చేయాల్సిన విభాగంలో అవినీతి పేరుకుపోవడం వల్ల ఇటీవల నగరంలోని హైరైజ్ బిల్డింగ్స్‌లోనూ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎంతో ప్రతిష్టాత్మకంగా..పకడ్బందీగా..అత్యధిక వ్యయాలతో నిర్మిస్తున్న ఆకాశహర్మ్యాలలోనూ విద్యుత్ ప్రమాదాలు జరగడంపై విస్మయం వ్యక్తమవుతోంది.



- నాసిరకం విద్యుత్ పనులతో షార్ట్ సర్క్యూట్లు
- నామమాత్రంగా సీఈఐజీ తనిఖీలు.. అక్రమ వసూళ్లు
- పీరియాడికల్ తనిఖీలు చేసిన వాటిలోనూ ప్రమాదాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఖానామెట్‌లోని 18 అంతస్తుల మీనాక్షి స్కైలాంజ్ అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ తీగల డక్ట్ నుంచి ఇటీవల ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ షార్ట్‌సర్క్యూట్‌కు నాసిరకం కేబుల్లే కారణమని అగ్నిమాపకశాఖ నిర్ధారించింది. 14వ అంతస్తులో చిక్కుకుపోయిన ఇద్దరిని బ్రాంటో స్కైలిఫ్ట్ సహాయంతో కాపాడే ప్రయత్నంలో ఇద్దరు అగ్ని మాపక సిబ్బంది అస్వస్థతకు గురికావాల్సి వచ్చింది. విషయం ఏమిటంటే.. ఈ భవనంలో విద్యుత్ పనులకు సంబంధించి తెలంగాణ చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అధికారి (సీఈఐజీ) నుంచి నిరభ్యంతర పత్రం కూడా పొందింది.

- రాయదుర్గం నాలెడ్జిసిటీ సత్వా ఎలిగ్జిర్ భవనం ఐదో అంతస్తులోని డిస్ట్రిక్స్ 150 బార్ అండ్ రెస్టారెంట్‌లో డిసెంబర్ 22న అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కావూరిహిల్స్ కృష్టాస్ కిచెన్ రెస్టారెంట్‌లోని ఏసీ బ్లోయర్‌లో (షార్ట్‌సర్క్యూట్) మంటలు చెలరేగి దట్టమైన పొగ కమ్మేసింది. అప్పటికే హోటల్లో భోజనం చేస్తున్న వాళ్లంతా ఊపిరాడక ఉక్కిరిబిక్కిరికి లోనయ్యారు.
- చందానగర్ ఐడీబీఐ బ్యాంక్ సెల్లార్‌లోని జనరేటర్‌లో ఇటీవల షార్ట్‌సర్క్యూట్ వెలుగు చూసింది. బ్యాంకుపై అంతస్తుల్లో కాలేజీ విద్యార్థులు చదువుతుండగా, అప్పటికప్పుడు వారిని ఖాళీ చేయించాల్సి వచ్చింది.
- కొండాపూర్‌లోని గెలాక్సీ అపార్ట్‌మెంట్‌లో డిసెంబర్ 31న విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రాజేంద్రనగర్ తేజస్వీనగర్‌లోని ఓ డ్రైక్లీనింగ్ దుకాణంలో ఉన్నట్టుండి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వెలుగు చూసింది. రూ.10 లక్షల విలువైన చీరలు, ఇతర దుస్తులు పూర్తిగా దగ్ధం అయ్యాయి.

..హైరైజ్ భవనాలు, పెద్ద పెద్ద అపార్టుమెంట్లలో ఇటీవల విద్యుత్ ప్రమాదాలు అధికమవుతున్నాయనడానికి పైన చెప్పిన ఉదంతాలు నిదర్శనం.

హైరైజ్ బిల్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కోకాపేట్, నార్సింగి, మణికొండ, నానాక్‌రాంగూడ, తుక్కుగూడలలోని బహుళ అంతస్తు భవనాల్లో ఇటీవల విద్యుత్ సంబంధిత అగ్నిప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ 20 నుంచి 50 అంతస్తుల భవనాలు ఉన్నాయి. వీటిల్లో అగ్నిప్రమాదాలను నియంత్రించే యంత్రాలు, యంత్రాంగం కూడా మన దగ్గర సరిగా లేదనే చెప్పొచ్చు. తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్‌లో 54 మీటర్ల వరకు (18 ఫ్లోర్లు) వెళ్లగలిగే క్రేన్లు (బ్రోంటో స్కైలిఫ్టులు) మాత్రమే ఉన్నాయి. ఆపై అంతస్తుల్లో ఏదైనా ప్రమాదం సంభవిస్తే.. వెళ్లలేని పరిస్థితి.

థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లే కీలకం

మెజార్టీ హైరైజ్ భవనాలను థర్డ్‌పార్టీ కాంట్రాక్టర్లే నిర్మిస్తున్నారు. అంతర్గత విద్యుత్ పనులు సైతం ఆ కాంట్రాక్టర్లతోనే చేయిస్తున్నారు. వీరు భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం తాత్కాలిక అవసరం కోసం లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. నాసిరకం కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు వాడుతున్నారు. కంటికి కన్పించే ప్లగ్‌లు, స్విచ్‌బోర్డులు, లైట్లు మినహా గోడలు, స్లాబులో వాడే వైర్లు నాసిరకంగా ఉంటున్నాయి. సామర్థ్యానికి మించి ఏసీలు, వాషింగ్ మిషన్లు, గ్రీజర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వినియోగించడం వల్ల ఒత్తిడికి గురై కేబుళ్ల జాయింట్ల వద్ద షార్ట్ సర్క్యూట్‌లు జరుగుతున్నాయి. సాధారణ భవనాలతో పోలిస్తే.. సీఈఐజీ అనుమతులు, పీరియాడికల్ ఇన్‌స్పెక్షన్లు పొందిన బహుళ అంతస్తుల భవనాల్లోనే ఈ విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు ఎక్కువ జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

అక్రమ వసూళ్లకు అడ్డాగా సీఈఐజీ

విద్యుత్ కేబుళ్లు, పరికరాల నాణ్యతను పరిశీలించి, వాటికి అనుమతులు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా 'చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ టు గవర్నమెంట్ (సీఈఐజీ)' విభాగాన్ని ఏర్పాటు చేసింది. పరిశ్రమలతో పాటు 15 మీటర్ల ఎత్తు దాటిన ప్రతి వాణిజ్య, గృహ సముదాయానికి విద్యుత్ తనిఖీ అధికారి ఎన్‌ఓసీ తప్పనిసరిచేసింది. భవిష్యత్తు విద్యుత్ అవసరాలు, ఎంపిక చేసిన విద్యుత్ సామర్థ్యం, ఇన్‌కమింగ్ లైన్, అంతర్గత విద్యుత్ లైన్లు, వినియోగించే కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఎర్తింగ్ సిస్టం సహా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్) వంటివన్నీ పక్కాగా ఉన్నట్లు నిర్ధారించిన తర్వాతే నిరభ్యంతర పత్రం జారీ చేయాల్సి ఉంది. మెజార్టీ భవనాలకు కనీసతనిఖీ లేకుండానే ఎన్‌ఓసీలు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం ఒక్కో అపార్ట్‌మెంట్‌కు ఎంపిక చేసిన విద్యుత్ లోడును బట్టి రూ.60 వేల నుంచి రూ.లక్షన్నర వరకు వసూలు చేస్తున్నారని, వాణిజ్య భవనాలు, పరిశ్రమలైతే ఏకంగా రూ.ఏడు నుంచి పది లక్షల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

ఏజెంట్ల ద్వారా వస్తేనే..

సీఈఐజీ అనుమతుల కోసం ఆయా అపార్ట్‌మెంట్‌లు, పరిశ్రమలు డ్రాయింగ్ అప్రూవల్స్‌ను టీఎస్‌ఐపాస్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. సీఈఐజీ కనుసన్నల్లో మెలిగే ఏజెంట్ల ద్వారా వచ్చిన వాటికే అనుమతులు ఇస్తూ..ఇతర మార్గాల ద్వారా వచ్చే ఫైల్స్‌కు వివిధ సాంకేతిక అంశాలను సాకుగా చూపించి తిరస్కరిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఆయా వినియోగదారులు సీఈఐజీ ఏజెంట్లను ఆశ్రయించి అనుమతులు పొందాల్సిన దుస్థితి నెలకొంది.

వార్షిక పరీక్షలపై దృష్టి పెట్టండి

- ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేయాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి సూచన



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 51, ఇతర విభాగాలకు సంబంధించి 16 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం ఆయా విభాగాల అధికారులు కృషి చేయాలని అన్నారు. ప్రజల నుంచి అందే అర్జీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు పథకాల వివరాలను గ్రామ పంచాయతీ/ మున్సిపాలిటీ వార్డుల వారీగా నమోదు చేయాలని సూచించారు. టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షల కోసం విద్యార్థులను సంసిద్ధులను చేయాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల అధికారులు, తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

రోలును తిరగేసి.. పాత్రంతో పొడిచేసి!

- భార్య ఎముకలు మాయం చేసేందుకు గురుమూర్తి చేసింది ఇదే..
- 'మీర్‌పేట' మర్డర్ కేసులో వెలుగులోకి వస్తున్న కీలకాంశాలు

సాక్షి, సిటీబ్యూరో: 'భార్యను చంపి, ఉడకబెట్టిన' కేసులో కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితుడు గురుమూర్తి భార్య మృతదేహాన్ని ముక్కలు చేశాక..ఉడకబెట్టడానికి కాస్టిక్ సోడాను, ఎముకలను పొడి చేయడానికి రోలు, పాత్రం వినియోగించాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిసింది. భార్యను చంపిన తర్వాత మృతదేహాన్ని మాయం చేయడానికి ఓ సినిమాతోపాటు ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేయడం ద్వారా లభించిన వీడియోలను చూసి ఈ ప్లాన్ అమలు చేశాడని గుర్తించినట్లు సమాచారం. ఆ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇదే పనిలో ఉన్నాడని తేల్చినట్లు తెలిసింది. రాచకొండ పోలీసు కమిషనరేట్‌లోని మీర్‌పేట పరిధి జిల్లెలగూడలో జరిగిన వెంకట మాధవి హత్య కేసులో పోలీసులు ఒక్కో చిక్కుముడి విప్పుతున్నారు. ఆధారాలు సేకరించడానికి ఉన్న అవకాశాలపై దృష్టి పెట్టారు. దేశవ్యాప్తంగా ఉన్న ఫోరెన్సిక్ నిపుణుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు.

బయటికెళ్లి సామగ్రి కొనుక్కొచ్చి..

ఈ నెల 14న రాత్రి గొడవ జరగడంతో గురుమూర్తి మాధవి తలను బలంగా గోడకేసి కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి, కాసేపటికే మరణించింది. గురుమూర్తి మరుసటి రోజున ఐదుసార్లు ఇంట్లోంచి బయటికి వెళ్లి వచ్చినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. అలా వెళ్లి వస్తూ మాంసం కొట్టే మొద్దు, కత్తి, కాస్టిక్ సోడా, కొత్త వాటర్ హీటర్ కొనుక్కు వచ్చినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని బాత్‌రూమ్‌లోకి లాక్కుపోయిన గురుమూర్తి.. అక్కడే మాంసం కొట్టే మొద్దుపై కత్తితో ముక్కలు చేశాడు. పెద్ద బకెట్‌లో హీటర్ పెట్టి నీళ్లు మరిగిన తర్వాత ముక్కల్ని అందులో వేశాడు. మాంసం పూర్తిగా ఉడికిపోయి విడిపోవడానికి అందులో కాస్టిక్ సోడా కలిపి ఉంటాడని.. ఉడికిపోయాక కమోడ్‌లో వేసి ఫ్లష్ చేసి ఉంటాడని ఫోరెన్సిక్ నిపుణులు చెప్తున్నారు. ఇక ఎముకలను స్టవ్ మీద పెట్టి కాల్చి..తర్వాత రోలుపై పెట్టి పాత్రంతో కొట్టి పొడిగా మార్చాడని పోలీసులు నిర్ధారించినట్లు తెలిసింది. తర్వాత ఎముకల పొడి, కత్తిని జిల్లెలగూడ చెరువులో పారేసినట్టు సమాచారం. మృతదేహాన్ని మాయం చేయడం పూర్తయ్యాక ఆధారాలేవీ చిక్కకుండా రోలు, పాత్రం, మొద్దును, బాత్‌రూమ్‌ను పలు మార్లు కడిగేశాడని...పదే పదే నీటిని ఫ్లష్ చేస్తూ డ్రైనేజీలోనూ ఎలాంటి ఆనవాళ్లు మిగలకుండా చేశాడని పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. అయితే ఫోరెన్సిక్ నిపుణులు స్టవ్‌పై చిన్న మాంసం ముక్క, వెంట్రుకలతోపాటు మాధవి తలను గోడకు కొట్టిన చోట రక్తపు మరకల్ని గుర్తించారని..డీఎన్ఏ పరీక్షలు చేయించాలని నిర్ణయించారని సమాచారం.



బాధ్యతలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



సాయినాథ్‌కు పూలమొక్కను అందిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

ప్రత్యేకాధికారుల బాధ్యతల స్వీకరణ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా అడిషనల్ కలెక్టర్ ప్రతిమా సింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ బాధ్యతలు స్వీకరించిన ఆమెకు కమిషనర్ బాలకృష్ణ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. మున్సిపాలిటీకి సంబంధించిన చార్జీ బుక్స్‌ను అందజేశారు.

ఇబ్రహీంపట్నం ప్రత్యేకాధికారిగా..

ఇబ్రహీంపట్నం: అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ ఆమెను మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.

శంకర్‌పల్లిలో సాయినాథ్

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా వి.సాయినాథ్ సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఆదివారంతో పాలకవర్గ పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ఆయనను శంకర్‌పల్లి మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా నియమించింది. అయితే వి.సాయినాథ్ ప్రస్తుతం మున్సిపల్ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా విధులు నిర్వర్తిస్తుండగా.. ప్రభుత్వం ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని, ప్రస్తుతం ఉన్న లోటుపాట్లపై సమీక్షిస్తానన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి కమిషనర్ శ్రీనివాస్, మేనేజర్ అంజన్ కుమార్, పర్యావరణాధికారి ఆనంద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేటలో శ్రీనివాస్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ సెక్యూరిటీ పీఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్న పి.శ్రీనివాస్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కమిషనర్ సరస్వతి, మేనేజర్ బొమ్మ నాగేశ్వర్‌రావు, ఆర్‌ఓ వేణుగోపాల్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డికి స్వాగతం పలికారు.

కొత్తగా 2



చేవెళ్ల వ్యూ



మొయినాబాద్ వ్యూ

- మున్సిపాలిటీలుగా చేవెళ్ల, మొయినాబాద్
- చేవెళ్లలో 8, మొయినాబాద్‌లో 8 గ్రామాల విలీనం
- నేటి నుంచి పురపాలికల పరిధిలోకి ఆయా గ్రామాలు
- కొత్త మున్సిపాలిటీలకు ఇన్‌చార్జి కమిషనర్ల నియామకం

చేవెళ్ల/మొయినాబాద్: జిల్లాలో మరో రెండు కొత్త మున్సిపాలిటీలు కొలువుదీరాయి. చేవెళ్ల, మొయినాబాద్ పురపాలికలుగా మారాయి. ప్రభుత్వం ఇటీవలే గెజిట్ ప్రకటించగా రెండు మున్సిపాలిటీలకు సోమవారం ఇన్‌చార్జి కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇక ఈ మండలాలు మున్సిపల్ పరిధిలోకి వచ్చాయి. ఈ మేరకు ఆయా మున్సిపాలిటీల్లో విలీనం కానున్న గ్రామాలకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుంటున్నారు. పంచాయతీ బోర్డులు మార్చాలని అధికారులు ఆదేశాలిచ్చారు. రెండు కొత్తవాటితో కలిపి చేవెళ్ల నియోజకవర్గంలో మూడు మున్సిపాలిటీలు ఐదు మండలాలు ఉండనున్నాయి.

చేవెళ్ల పరిధిలో ఇలా..

కొత్తగా ఏర్పడిన చేవెళ్ల మున్సిపాలిటీలో ఎనిమిది గ్రామాలు విలీనం అయ్యాయి. విలీన గ్రామాలు, ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్ల (8,940), దామరగిద్ద (1,582), ఇబ్రహీంపల్లి (960), కేసారం (876), దేవుని ఎర్రవల్లి (1,464), మల్కాపూర్ (2,056), ఊరేళ్ల (2,544), రామన్నగూడ (882) కలిపి మొత్తం 19,304 మంది ఓటర్లు ఉన్నారు.

మొయినాబాద్ పరిధిలో ఇలా..

నూతన మున్సిపాలిటీగా మారిన మొయినాబాద్‌లో ఎనిమిది గ్రామాలు విలీనం అయ్యాయి. ఈ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు, ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. మొయినాబాద్ (2,516), అజీజ్‌నగర్ (4,757), హిమాయత్‌నగర్ (3,902), ఎన్కేపల్లి (2,395), చిలుకూరు (6,100), పెద్ద మంగళారం (4,590), సురంగల్ (1,810), ముర్తుజగూడ (1,300)తో కలిపి మొత్తం 27,370 మంది ఓటర్లు ఉన్నారు.

చేవెళ్ల ఇన్‌చార్జి కమిషనర్‌గా కృష్ణమోహన్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి

నూతనంగా ఏర్పాడిన చేవెళ్ల మున్సిపాలిటీకి ఇన్‌చార్జి కమిషనర్‌గా నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ఈ మేరకు సోమవారం ఆయన చేవెళ్ల పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పంచయతీ కార్యదర్శులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం మున్సిపాలిటీలో విలీనమైన ఎనిమిది గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడారు. ఆయా గ్రామాల గురించి అడిగి తెలుసుకున్నారు. కొత్త మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకునేందుకు కలిసి పని చేద్దామని అన్నారు.

మొయినాబాద్ ఇన్‌చార్జి కమిషనర్‌గా శరత్‌చంద్ర



బాధ్యతలు స్వీకరించిన శరత్‌చంద్ర

కొత్తగా ఏర్పాటైన మొయినాబాద్ మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ శరత్ చంద్ర బాధ్యతలు స్వీకరించారు. మొయినాబాద్‌లో సోమవారం ఆయన బాధ్యతలు తీసుకున్న అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. పంచాయతీల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ పేర్లను తొలగించాలని ఆదేశించారు. మొయినాబాద్, పెద్దమంగళారం, చిలుకూరు, సురంగల్, ముర్తూజగూడ, ఎనికేపల్లి, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ పంచాయతీలను కలిపి మొయినాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు.

150వ వార్షికోత్సవానికి తరలిరండి

- ప్రొఫెసర్ హరగోపాల్
- 31న మొగిలిగిద్దకు సీఎం రేవంత్‌రెడ్డి రానున్నట్టు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న హరగోపాల్

షాద్‌నగర్‌రూరల్: మొగిలిగిద్ద ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఎక్కడ, ఏ స్థాయిలో ఉన్నా 150వ వార్షికోత్సవానికి తరలి రావాలని పౌరహక్కుల సంఘం నేత, ప్రొఫెసర్ హరగోపాల్ కోరారు. పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ చరిత్రలో 150 ఏళ్ల పూర్తి చేసుకున్న పాఠశాలల్లో మొగిలిగిద్ద 4వ స్థానంలో ఉందని అన్నారు. 150 వసంతాల వేడుకలకు ఈ నెల 31న సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. పూర్వ విద్యార్థులతో పాటు పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యానికి ముందుగానే 1873లో ఏర్పాటు చేసిన మొగిలిగిద్ద ప్రభుత్వ పాఠశాలకు ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. మాజీ సీఎం బూర్గుల రామకృష్ణారావు, మాజీ గవర్నర్ సత్యనారాయణరెడ్డి, రిటైర్డ్ ట్రాన్స్‌కో ఎస్‌ఈ మహాత్మారెడ్డివంటి వారు ఎందరో ఇక్కడి పాఠశాలలో చదివినవారేనని గుర్తు చేశారు. సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థులు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేణుగోపాల్, విద్యుత్‌శాఖ మాజీ ఎస్‌ఈ మహాత్మారెడ్డి, చార్టెడ్ అకౌంటెంట్ మల్లికార్జున్, ప్రొఫెసర్ వనమాల, పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీరుద్ర సహిత శత చండీయాగం

రెండో రోజు హాజరైన మాజీ మంత్రులు



పూజలు చేస్తున్న మాజీ మంత్రులు సబితారెడ్డి, హరీశ్‌రావు, దయాకర్‌రావు తదితరులు

కందుకూరు: దాసర్లపల్లి సమీపంలోని శ్రీమాత క్షేత్రంలో చండీ ఉపాసకులు రేవెళ్ల రాజుశర్మ ఆధ్వర్యంలో చేపట్టిన శ్రీరుద్ర సహిత శత చండీ యాగం రెండో రోజు సోమవారం వైభవంగా కొనసాగింది. ముందుగా ప్రాతఃకాల పూజలు, పారాయణాలు నిర్వహించిన అనంతరం 108 యజ్ఞ గుండాల్లో శ్రీరుద్ర సహిత శత చండీ యాగాన్ని వేద బ్రాహ్మణులు చేపట్టారు. సాయంత్రం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, అంతకు ముందు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయా నేతల వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు కె.జయేందర్, మన్నే జయేందర్, గణేశ్‌రెడ్డి, అంజయ్యగౌడ్, కృష్ణ రాంభూపాల్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, రాములు, శేఖర్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, ఆనంద్, మాజీ ఎంపీటీసీ ఇందిర, మాజీ సర్పంచ్ బాలమణి పాల్గొన్నారు.

వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ


హత్యకు గురైన శివానంద (ఫైల్)


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

- నిందితుడిని పట్టించిన సెల్‌ఫోన్ సిగ్నల్స్
- వివరాలు వెల్లడించిన మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

మేడ్చల్ రూరల్: మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ ఓఆర్ఆర్ వద్ద జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు గురైన మహిళ నిజామాబాద్ జిల్లా భోదన్‌కు చెందిన శివానంద(45)గా గుర్తించారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం మీడియాకు వెల్లడించారు. శివానంద(45)భర్త సాయిలుతో గొడవపడి కుటుంబానికి దూరంగా ఉంటోంది. ప్రస్తుతం కొంపల్లిలో నివాసం ఉంటుంది. మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇదిలా ఉండగా కరీంనగర్ జిల్లా కమలాపూర్‌కు చెందిన షేక్ ఇమామా (37)సిటీకి వచ్చి మేడ్చల్‌బస్ స్టాప్ వద్ద శివానందను చూసి మాటలు కలిపాడు. అనంతరం ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై మునీరాబాద్ గ్రామ శివార్లలో నిర్మానుష్య ప్రదేశమైన ఓఆర్ఆర్ కల్వర్టు కిందకు వెళ్లారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్యా డబ్బువిషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో షేక్ ఇమామ్ మృతురాలు శివనంద గొంతును నులుమడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. పక్కనే ఉన్న బండరాయితో తలపై కొట్టడంతో మరణించింది. అనతంరం నిందితుడు మునీరాబాద్ వెళ్లి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కొనుగోలు చేసి తిరిగి ఘటనా స్థలికి వచ్చాడు. మృతురాలిపై పెట్రోల్ పోసి నిప్పంటించి పరారయ్యాడు. ఈ నెల 24న సాయంత్రం మేడ్చల్ పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని పలు ఆధారాలు సేకరించారు. మెట్టెల ఆధారంగా మృతురాలు వివాహితగా గుర్తించారు.

నోటీసులతో వీడిన మిస్టరీ..

హత్య కేసులో గుర్తు తెలియని మహిళ హత్యకు గురైనట్లు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతురాలి చేతులపై ముగ్గురి పేర్లున్న పచ్చబొట్టు ఉండడంతో జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్లకు పంపించారు. ఈ విషయం తెలుసుకున్న శివానంద కుటుంబసభ్యులు పోలీసులను సంప్రదించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నిందితుడు షేక్ ఇమామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఈ మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.

చౌదరిగూడలో చోరీ

బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

కొందుర్గు: చౌదరిగూడ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గూడ నారాయణ తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో ఫంక్షన్ కోసం మరో గ్రామానికి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చే వరకు ఇంటి గడియలు విరగ్గొట్టి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో బీరువాను తెరిచి చూడగా రూ.45వేల నగదు, మూడు తులాల బంగారు, 25 తులాల వెండి ఆభరణాలు అపహరించారు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వర్లు, క్లూస్‌టీం ఘటనా స్థలిని పరిశీలించి ఆధారాలు సేకరించారు.


సంఘటనా స్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

వ్యసనాలకు దూరంగా ఉండాలి
- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న చలో భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇబ్రహీంపట్నం హెచ్ఆర్డీ పాఠశాలలో క్రీడోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థికి క్రీడలపై అవగాహన ఉండాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. యువత దేశానికి పట్టుకొమ్మలని.. చెడు దారిల్లో నడిస్తే దేశానికే ముప్పుగా మారుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పృథ్వీ, శివకృష్ణ, జగదీశ్, పవన్, మహేందర్, నవీన్, చరణ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రతకే షీ టీమ్స్

ఇబ్రహీంపట్నం రూరల్: బాలికల భద్రతకే షీ టీమ్స్ పనిచేస్తాయని.. విద్యార్థినులు ఆత్మ విశ్వాసంతో ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మండల పరిధిలోని మంగళ్‌పల్లి గేట్ వద్ద సోమవారం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో సమావేశమయ్యారు. డయల్ 100, షీటీమ్స్, డ్రగ్స్, సోషల్ మీడియాపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. డ్రగ్స్ వాడకం, పోకిరీల వేధింపులు, ర్యాగింగ్ వంటి సంఘటనలు జరిగితే వెంటనే 100 నంబర్‌కు ఫోను చేసి సమాచారం అందించాలని సూచించారు. నేరం జరిగినప్పుడు మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే 100, 1930, 8712662111 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు ఉన్నతంగా చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మధు, ఎస్ఐలు రామకృష్ణ శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు

అనుమానం, వరకట్న వేధింపులు

భర్తపై భార్య ఫిర్యాదు

కేశంపేట: అనుమానంతో అర్ధాంగి వేధిస్తున్న భర్తపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటన కేశంపేట ఠాణా పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితురాలు తెలిపిన ప్రకారం.. షాబాద్ మండల పరిధిలోని కక్కులూరు గ్రామానికి చెందిన కావలి శ్రీనివాస్, సరితకు 13 ఏళ్లక్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు సంతానం. ఏడాది పాటు వీరి సంసారం సాఫీగానే సాగినా తదనంతరం శారీరకంగా, మానసికంగా హింసిస్తుండడంతో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ శ్రీనివాస్ ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో సరిత అమ్మమ్మ గ్రామమైన నిర్ధవెళ్లికి కుటుంబంతో సహా వలసవచ్చారు. ఇక్కడే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 7న అనారోగ్యంతో ఉన్నప్పటికీ భార్యను బైక్ పనికి తీసుకెళ్తుండగా ఆమె మార్గమధ్యలో స్పృహతప్పి పడిపోయింది. ఇంటి వద్ద ఉంటున్న తనను రెండు తులాల బంగారం ఇస్తామని మీ అమ్మవాళ్లు ఒప్పుకొన్నారని.. ఆ బంగారం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని సరిత ఫిర్యాదులో పేర్కొంది. కేసు దర్యాప్తులో ఉంది.

వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

మణికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. నార్సింగి పోలీసులు తెలిపిన ప్రకారం.. కోకాపేట టోల్‌గేట్ నుంచి ఐఎస్‌బీ రోడ్డులో నడుచుకుంటూ వెళ్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని బైక్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో అతని తలకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతి చెందిన వ్యక్తి జీన్స్ పాయింట్, టీ షర్ట్ ధరించి తెల్లటి గడ్డం, మీసాలతో ఉన్నాడన్నారు. అతనికి సంబంధించిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

రూ.15 లక్షల రుణం కోసం రూ.5.5 లక్షలు 'చెల్లింపు'

ఉపాధ్యాయురాలికి సైబర్ నేరగాళ్ల టోకరా

సాక్షి, సిటీబ్యూరో: వ్యక్తిగత రుణం కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేసిన ఓ ఉపాధ్యాయురాలు రూ.5.5 లక్షలు నష్టపోయారు. రూ.15 లక్షల రుణం కోసం ప్రయత్నించి, ఆ మొత్తం మంజూరు చేస్తామన్న వారికి ఈ మొత్తం చెల్లించడం గమనార్హం. నగరానికి చెందిన బాధితురాలు పర్సనల్ లోన్ కోసం ఆన్‌లైన్‌లో వెతికారు. అందులో దొరికిన ఓ నెంబర్‌కు సంప్రదించగా..... మహేష్ అని చెప్పుకున్న వ్యక్తి మాట్లాడాడు. తనకు రూ.15 లక్షల రుణం కావాలని ఆమె కోరగా... మధ్యవర్తిత్వం వహించడానికి అతడు అంగీకరించాడు. అప్పటి నుంచి ప్రాసెసింగ్ ఫీజు, ఇతర పన్నులతో సహా వివిధ పేర్లు చెప్తూ ఆమె నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారు. రూ.2 వేలతో మొదలుపెట్టి మొత్తం రూ.5.5 లక్షలు డిపాజిట్ చేయించుకున్నాడు. అయినప్పటికీ రుణం మంజూరు కాకపోవడంతో తాను మోసపోయానని గుర్తించిన బాధితురాలు సోమవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

ఎంపీడీఓ కార్యాలయ ఆకస్మిక తనిఖీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని సోమవారం జిల్లా పరిషత్ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగానే కార్యాలయానికి వచ్చి ఫైల్స్, రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటమ్మ, సూపరింటెండెంట్ ఎల్లంకి జంగయ్య, సిబ్బంది ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

నీటి సంపులో పడి బాలుడి మృతి

నందిగామ: మూడేళ్ల బాలుడు నీటి సంపులో పడి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని జంగోనిగూడ ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. బీహార్‌కు చెందిన సిమ్మూని కుమార్ స్థానికంగా ఓ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ జంగోనిగూడలో అద్దె ఇంట్లో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం కుమార్ విధులకు వెళ్లగా భార్య ఇంట్లో పనులు చేసుకుంటోంది. ఈ సమయంలో బాలుడు ఆయుష్(3) ఆడుకుంటూ బయటకు వెళ్లాడు. వీరి ఇంటి పక్కనే నిర్మాణం చేపట్టిన ఓ ఇంటి ఎదుట ఉన్న నీటి సంపులో పడిపోయాడు. కాసేపటికి గమనించిన తల్లి కుమారుడి కోసం వెతకారు. పక్కనే ఉన్న సంపులో పరిశీలించగా బాలుడు కనిపించాడు. వెంటనే బయటకు తీసి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. బాలుడి తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆయుశ్ మృతదేహం

విదేశీ గంజాయి విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్

శంషాబాద్: విదేశీ గంజాయిని విక్రయిస్తున్న బెంగళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను శంషాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం అరెస్ట్ చేసింది. శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణ ప్రియ తెలిపిన మేరకు.. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తూర్పు గోదావరి రాయవరం గ్రామానికి చెందిన శివరాం(28) బెంగళూరుకు చెందిన కర్ర అజయ్ నుంచి కాలిఫోర్నియాకు చెందిన విదేశీ గంజాయి (ఓజీ కుష్) కొనుగోలు చేశాడు. ఒక గ్రాము రూ. 1500 కొనుగోలు చేసి దానిని నగరంలో రూ. 3 వేల చొప్పున విక్రయిస్తున్నాడు. ప్రతి శని, ఆదివారాలు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తెచ్చి హైదరాబాద్‌లో అవసరమైన వారికి విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 175 గ్రాముల విదేశీ గంజాయితో పాటు కిలో గంజాయి పొడి తీసుకుని గచ్చిబౌలి వరకు వచ్చాడు. ఈ సమాచారం అందడంతో శంషాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని శేరిలింగంపల్లి పోలీసులకు అప్పగించారు. అతడి నుంచి గంజాయితో పాటు ద్విచక్ర వాహనం, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదం అనుకున్నారు కానీ.. అది ఆత్మహత్య

మేడ్చల్ రూరల్: లారీ వేగంగా వస్తున్న సమయంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతున్నట్లు వెళ్లి ఒక్కసారిగా రోడ్డుపై పడుకున్నాడు. దీంతో లారీ అతనిపై వెళ్లడంతో మృతి చెందాడు. పోలీసులు ముందు దీనిని రోడ్డు ప్రమాదం అని భావించారు.అయితే సీసీ కెమెరాల్లో మాత్రం అసలు నిజం బయటపడింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఆదివారం రాత్రి మేడ్చల్ పట్టణంలో రోడ్డు ప్రమాదం జరిగింది. నగరం వైపు వెళ్తున్న లారీ ఓ గుర్తు తెలియని వ్యక్తి పైనుండి వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోలీసులు ఘటన తీరును తెలుసుకునేందుకు సమీపంలోని పలు సీసీ కెమెరాలు పరిశీలించారు. మృతుడు రోడ్డు దాటుతున్నట్లుగా వెళ్లి లారీ వచ్చే సమయంలో ఒక్కసారిగా రోడ్డుపై పడుకోవడంతో లారీ అతని శరీరంపై నుండి వెళ్లింది. దీంతో మృత్యువాత పడ్డాడు. సీసీ కెమెరాలో నమోదైన ఘటన దృశ్యాలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

తిరుమల బ్యాంక్‌కు రూ.2.45 కోట్ల టోకరా

ఈక్విటాస్ బ్యాంక్ మేనేజర్‌పై కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: అధిక వడ్డీ చెల్లిస్తామంటూ తిరుమల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌కు రూ.2.45 కోట్ల టోకరా వేశారు. ఈక్విటాస్ బ్యాంక్ ఏఎస్ రావు నగర్ బ్రాంచ్ మేనేజర్ హరిప్రసాద్ తదితరులు ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారు. తిరుమల బ్యాంక్ సీఈఓ ఫిర్యాదు మేరకు సోమవారం నగర సీసీఎస్‌లో కేసు నమోదైంది. మలక్‌పేట కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న తిరుమల కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 2016 నుంచి ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్‌లో ఫిక్సిడ్ డిపాజిట్లు చేస్తూ వస్తోంది. ఈక్విటాస్ బ్యాంక్‌కు ఏఎస్‌రావ్ నగర్ బ్రాంచ్ మేనేజర్‌గా జి.హరిప్రసాద్ వ్యవహరిస్తున్నారు. తమ వద్ద ఫిక్సిడ్ డిపాజిట్లు చేస్తే అధిక మొత్తం వడ్డీ ఇస్తామని హరిప్రసాద్ చెప్పడంతో తిరుమల బ్యాంక్ పది దఫాలుగా రూ.3.5 కోట్లు ఫిక్సిడ్ డిపాజిట్ చేసింది. వీటి గడువు పూర్తయినప్పటికీ తిరిగి చెల్లించడంలో ఈక్విటాస్ విఫలమైంది. దీంతో తిరుమల బ్యాంక్ సంబంధీకులు ప్రశ్నించగా డిపాజిట్లను రెన్యువల్ చేయాలని కోరారు. ఆరా తీయగా రూ.1.05 కోట్లకు సంబంధించిన డిపాజిట్లు మాత్రమే రికార్డుల్లో ఉన్నాయని, మిగిలిన రూ.2.45 కోట్లకు సంబంధించి అకౌంట్స్‌లో లేవని ఈక్విటాస్ ఉన్నతాధికారులు చెప్పారు. కాగా ఈక్విటాస్ బ్యాంక్‌లో ఫిక్సిడ్ డిపాజిట్స్ కోసం బదిలీ చేసిన మొత్తం బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్‌ల్లో ఉన్న ఖాతాల్లోకి వెళ్లిందని తేలింది. అవి ఈక్విటాస్ బ్యాంక్‌ను పోలిన పేరుతో తెరిచినవిగా తేలింది. దీంతో హరిప్రసాద్ తదితరులు ఉద్దేశపూర్వకంగా మోసం చేసినట్లు గుర్తించారు. దీంతో తిరుమల బ్యాంక్ సీఈఓ శోభనాద్రి సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

సంపూర్ణ మద్యపాన నిషేధానికి అడుగులు

- ఎన్నికల వేళ మద్యం పంచితే రూ.4 లక్షలు
- విక్రయిస్తే రూ.40 వేలు, కొన్నవారికి రూ.20 వేల జరిమానా
- తీర్మాన పత్రాన్ని సీఐ విజయ్‌కుమార్‌కు అందజేసిన ఉప్పరిగడ్డా తండావాసులు

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల సమయంలో మద్యం పంచినా, అమ్మినా, కొన్నా జరిమానా విధిస్తామని ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డతండా వాసులు సోమవారం తీర్మానం చేసుకున్నారు. అనంతరం ఈ తీర్మాన పత్రాన్ని పట్టణ సీఐ విజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎన్నికల్లో మద్యం పంచితే రూ.4లక్షలు, అమ్మితే రూ.40వేలు, కొన్నవారికి రూ.20వేల జరిమానా విధిస్తామన్నారు. మద్యం పంచుతున్న, అమ్ముతున్న సమాచారాన్ని గ్రామస్తులకు తెలిపే వారికి రూ.పదివేల నజరానా అందిస్తామన్నారు. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని తీసుకువచ్చేందుకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నామన్నారు. ఇందుకు పంచాయతీ పరిధిలోని తండావాసులు సహకరించాలని కోరారు.


తీర్మాన పత్రాన్ని సీఐ విజయ్‌కుమార్‌కు అందజేస్తున్న గ్రామస్తులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

ఏసీపీ రంగస్వామి


లాడ్జీలో తనిఖీలు చేపడుతున్న ఏసీపీ రంగస్వామి, పోలీసులు

షాద్‌నగర్‌రూరల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని ఏసీపీ రంగస్వామి అన్నారు. సోమవారం పట్టణంలోని లాడ్జీలపై ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పోలీసుల దాడులు నిర్వహించారు. లాడ్జీలకు సరైన వసతులు ఉన్నాయా, ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. పట్టణంలోని అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా లాడ్జీలలో తనిఖీలను చేపట్టామన్నారు. లాడ్జీల యజమానులకు అనుమతులు తప్పనిసరి. లాడ్జీలకు వచ్చే వారి పూర్తి సమాచారాన్ని తీసుకోవాలని.. ఎలాంటి ఘనటలు చోటుచేసుకున్నా లాడ్జీ యజమానులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. లాడ్జీకి వచ్చే వారు గదిలో ఉన్నారా? చెప్పకుండా ఖాళీ చేసి వెళ్లిపోయారా అనే విషయాలను ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. సీసీ కెమెరాలను తప్పక ఏర్పాటు చేసుకోవాలని, లాడ్జీలలో జరుగుతున్న విషయాలను గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐలు బలరాం, సుశీల, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

'వేయి గొంతులు-లక్ష డప్పులు'ను జయప్రదం చేద్దాం


సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు శంకర్‌రావుమాదిగ

మొయినాబాద్ రూరల్: ఫిబ్రవరి 7న నిర్వహించ తలపెట్టిన వేయి గొంతులు-లక్ష డప్పులు కార్యక్రమాన్ని జయప్రదం చేద్దామని ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్‌రావు మాదిగ, కె.ప్రవీణ్ అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్ చౌరస్తాలోని కంజర్ల ప్లాజాలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాదిగ మాట్లాడుతూ.. వర్గీకరణ వ్యతిరేకులకు బుద్ధి చెప్పేలా మాదిగలంతా ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో తలపెట్టిన సభకు పెద్ద ఎత్తున తరలివెళ్దామన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు ఉప్పరి శ్రీను, ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రేమ్‌కుమార్, దేవ్‌కుమార్, జి.దర్శన్, భాస్కర్, ప్రదీప్, షాబాద్ దర్శన్, సునీల్, ప్రభుచరణ్, ప్రశాంత్, శ్రీధర్, రాజు, రవి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

తాండూరు రూరల్ సీఐ నగేశ్

యాలాల: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని తాండూరు రూరల్ సీఐ నగేశ్ అన్నారు. సోమవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు కళాజాత బృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రిబుల్ రైడింగ్, డ్రంకెన్ డ్రైవ్, రాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌పై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. డ్రగ్స్, సైబర్ క్రైమ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లైసెన్సు, వాహనాల పత్రాలు లేకుండా రోడ్లపైకి వస్తే జరిమానా విధిస్తామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యాలాల ఎస్ఐ గిరి, కానిస్టేబుళ్లు నరేశ్, బలరాం, జిల్లా కళాజాత బృందం సభ్యులు ఉన్నారు.